# 1 ఆమె కన్నులు

ఒక్కొక్క అమ్మాయి ఏ కళ్ళలోనో, పెదవులపై చిరునవ్వులోనో, చక్కగావేసే అడుగులలోనో సౌందర్యాన్నంతా దాచుకుంటుంది. ఒక్కొక్కడి కళ్ళు అక్కడే పడుతూంటాయి. ఎవరికీ కనిపించని ఆ అందాలు కనిపిస్తాయి ఇక అల్లరి ప్రారంభిస్తుంది మనస్సు. అందరూ అతన్నిచూసి నవ్వచ్చు. ఆమె అతన్ని చూడకే పోవచ్చు. తరువాత కొంతకాలంవరకూ జరిగే కథ మాత్రం వరవడి వెనుకే నడుస్తుంది.

ప్రకాశం రెండేళ్ళ క్రిందట ఇలాటి వ్యవహారంలో చిక్కుకున్నాడు. అత నెందుకు శారద నంతగా మోహించాడో అందరూ అనుకున్నది వేరు - ఆమె చాలా అందమైనది అని. నేనూ అలాగే అనుకున్నాను. కాని వాడు అదేమీ కా దన్నాడు. "ఆమె కళ్ళలో నాకేదో గొప్ప కాంతి కనిపిస్తుంది. అందుకోసమే ఆమెమీద నా కంతప్రేమ" అన్నాడు.

ఆ సాయంత్రం శారద పుట్టినరోజని టీ పార్టీ ఇచ్చింది. ఆరుగురం మేమూ, ఎనమండుగురు ఆమె స్నేహితురాండ్రూను....

చిన్నపార్టీ. వేసవి సెలవులకి అందరమూ వచ్చేశాము ఇళ్ళకి. అందు చేత నలుగురమూ ఒకసారి కలుసుకోవచ్చునని వెళ్ళాము.

సంపంగి రంగుచీర, చారల జాకెట్ - శారద నాకు తెలిసి నంతవరకూ ఏరోజూ వేసికోని బట్టలు. చాలా ఆకర్షణీయంగా వుంది. రేడియో సంగీతం. సాయంత్రం ఆరవుతుంది. అందరమూ భక్షణాల వ్యవహారం ముగించి సంభాషణకి ఉపక్రమించాము.

చాలా సేపటివరకూ రాజకీయాలని గురించీ, సినీమాలని గురించీ, ఇతర విషయాలని గురించీ చర్చించాక టైమయింది, లేద్దా మని చూస్తే ప్రకాశం లేడు. శారద అప్పుడే బయటినుంచి వస్తూంది. లైట్లకాంతిలో చాలా అందంగా వుంది.

"ప్రకాశం కనిపించాడా?" అన్నాను.

ఒక క్షణం ఆలోచించినట్లుగా ఆగి, "ఆ ఏదో పని ఉందని చెప్పి రూమ్‌కి వెళ్ళిపోయాడు" అంది.

నాకు చాలా ఆశ్చర్యం వేసింది- ప్రకాశం చాలా ఉత్సాహంగా వుండే మనిషి- అకస్మాత్తుగా ఎందుకు వెళ్ళిపోయాడని....

శారధ దగ్గర సెలవు తీసుకుని ప్రకాశం గదికి వెళ్ళాను. వాడికి ప్రపంచంలో నా అనేవాళ్ళెవరూ లేరు బ్యాంకులో గుమాస్తాగా పనిచేస్తూ బ్రతుకుతున్నాడు. పాతిక సంవత్సరాలుంటాయి. చక్కని రూపం.... పాడతాడు.

నేను వెళ్ళేసరికి తలుపు మూసి వుంది. లోపల రేడియో పాడుతోంది. లైటు వెలుగుతూంది.

పిలిచాను. తలుపు తట్టాను. జవాబు లేదు. కిటికీలోంచి చూశాను. ఎవరూ లేరు. అప్పుడు గ్రహించాను, తలుపు తాళంపెట్టి వుందని.

ఎక్కడికి కెళ్ళేడు?

నాలుగు వీధులూ తిరిగేను. ఎక్కడా కనపడలేదు. మా ఇంటికి వెళ్ళాడేమోనని వెళ్ళాను. అక్కడికీ రాలేదు.

ఇంక ఆ రాత్రి వాడిని వెతకలేక ఊరుకున్నాను. కాని, చాలా కంగారు పడ్డాను, వా దేమైనాడో అని.

మర్నాడు సాయంత్రందాకా వా డెక్కడా కనపడకపోతే వాడి రూమ్‌కి వెళ్ళాను. "టు లెట్" బోర్డు తగిలించి వుంది. బ్యాంకుకి వెళ్ళి వాకబు చేస్తే, ఉద్యోగానికి రాజీనామా ఇచ్చి వెళ్ళాడని తెలిసింది.

పోలీసు స్టేషన్‌కి వెళ్ళి ఏవైనా ఆత్మహత్యలు రిపోర్టు అయ్యాయా అని అడిగితే లేదన్నారు. నాకేమీ బోధపడలేదు.

నాలుగురోజులయాక వాడు ఉత్తరం రాశాడు:

"నీతో చెప్పకుండా కలకత్తా వచ్చేశాను. అడిగినంత మాత్రాన నువ్వు నన్ను క్షమిస్తావని నాకు తెలుసును.

ఆ వూళ్ళో నా కింక ఏమీలేదు, అన్నీ అమ్మేశాను. రొక్కం పట్టుకుని ఇక్కడికి వచ్చేశాను. చేతిలో ఆరు వందల రూపాయి లున్నాయి.

ఆదివారం సాయంత్రం శారద పుట్టినరోజు పార్టీలో మీ రందరూ ఏదో సంభాషణలో పడ్డారు. ఆ రోజు ఎందుకో శారద కళ్ళు నన్ను మరీ ఆకర్షించాయి...."నీతో మాటలాడాలి, ఒకసారి ఇవతలకి రా" అని పిల్చాను. మీ అందరి దృష్టి ఆమెమీద లేదు గనక ఆమె రాగలిగింది.

ఆ కిందని మామిడిచెట్టు లేదూ? అక్కడికి వెళ్ళాము. "నీ నిజమైన ఉద్దేశం చెప్పు....నన్ను ప్రేమించగలవా?" అని అడిగాను. ఆమె చిరునవ్వు నవ్వి "హాస్యమా?" అంది. నేను చాలా చిత్త శుద్ధితో అడిగా ననుకున్నాను. ఆ సంగతే చెప్పాను.

"నేను నిన్ను ప్రేమించలేను" అంది శారద. "అసలు ఎవరినీ ప్రేమించను" అనికూడా అంది. చాలా ఖండింతంగా చెప్పింది.

నే నెందుచేతనో పెద్ద గోతిలో పడ్డాను. శారద గురించి చాలా కలలు కన్నాను. ఆమె లేకపోతే నా జీవితం వ్యర్థం అని నిశ్చయించుకున్నాను. అందుచేతనే ఆత్మగౌరవాన్ని విడిచిపెట్టి, మళ్ళా అడిగాను - ప్రేమించమని, పోనీ పెళ్ళి చేసుకోమని. లేకపోతే

ఆత్మహత్య చేసుకుంటా నన్నాను. చవక రకం నవలలోంచి నడి చొచ్చినట్లే మాట్లాడాను.

కాని శారద ఖరీదైన నవల.... ఆ బెదిరింపులు వద్దంది. చేతనైతే ఒక లక్షో, ఏభై వేలో రూపాయిల ఆస్తి చూపమంది.

చాలా నిరాశ చెందాను. ఆమె వెళ్ళిపోయింది, ఒక్కసారి ఆ చక్కటి కళ్ళు నా వైపు తిప్పి.

గదికి వచ్చాను. జీవితం దుర్భరంగా కనిపించింది. నీ సలహా నాకు తెలుసును. అందుకే నిన్నడగలేను.

ఒక షాహుకారుకి నా రేడియో, ఇతర వస్తువులూ అమ్మ చూపాను. అయిదు వందలదాకా వచ్చాయి. జీతం నూరు వచ్చింది. ఉదయమే బయలుదేరి ఇక్కడికి వచ్చాను.

ఆ ఊళ్ళో ఇంక వుండలేనని నాకు తెలుసును. అందు చేతనే ఇలా వచ్చేశాను. మరుక్షణం ఏమౌతానన్న బాధలేదు నాకు. ఏమంటే, ఏమైనా నాకు సంతోషమే.

నా అడ్రస్ నీ కివ్వను. నీ మనస్సు నాకు తెలుసును. నేనైతే తరచు రాస్తూనే వుంటాను—నీ ప్రకాశం."

నే ననుకున్నంతా అయింది. శారద కాఠిన్యానికి నాకు చాలా కోపం వచ్చింది. శతజన్మలు తపస్సుచేసినా ప్రకాశం లాంటి మనిషి దొరకొద్దూ?

ఆ సాయంత్రం ఆమె దగ్గరకి వెళ్ళాను, నీ ఘనకార్యం చూడమని చెప్పడానికి.

కాని వెళ్ళగానే నవ్వుతూ, శారద "మీ మిత్రుడు ఉత్తరం రాశాడు" అంది.

"ఏమని?" అన్నాను.

"నువ్వే చూడు...." అని ఇచ్చింది. చాలా చిన్న ఉత్తరం:

"స్నేహితురాలు శారదకి- నా కళ్ళు తెరిచావు. నీ మనస్సులో ఉన్నమాట నిష్కర్షగా చెప్పినందుకు సంతోషం. ప్రేమ, ప్రేమ అని పలవరించినందుకు చక్కని గుణపాఠం నేర్పావు. నేను ఆత్మహత్య చేసుకుంటాననడం నీ మనస్సు ఎంత కఠినమైనదో

తెలిసికోటానికి మాత్రమే. కలకత్తాలో వుంటున్నాను. అడ్రస్ నీకు అనవసరం కాబట్టి ఇవ్వలేదు. —ప్రకాశం."

నేను ఉత్తరం నుంచి కళ్ళని ఎత్తేసరికి శారద నవ్వుని ఆపుకొంటూందని గ్రహించాను. కొంచెం అవమానపడ్డాను కూడా.

"ఈ వ్యవహారంలో నవ్వాల్సిన దేమీ లేదనుకుంటాను" అన్నాను కొంచెం కటువుగా.

"నాకేం తెలుసు?" అంది శారద.

"బాన్లే....వాణ్ణి నీ ప్రవర్తనతో బ్రతుకుమీదే విసుగు పుట్టే లాగ చేశావు పాపం! అన్నీ వదులుకుని వెళ్ళిపోయాడు. చెప్పేది కాస్త సౌమ్యంగా చెప్తే ఏం!" అన్నాను.

"నేనేం తిట్టలేదు-కొట్టలేదు. నా యిష్టం వచ్చినవాళ్ళని నేను ప్రేమిస్తాను. అదీ మీ ఇష్టమేనా?" అంది శారద.

"అలా నేననడం లేదు. కాని వాడు నీ మూలంగా ఇలా అయాడని చెప్దామని వచ్చాను. నీకే ఉత్తరం వచ్చింది. అయితే, నీ ప్రేమ ఖరీదు, ఏభై వేలరూపాయ లన్నమాట?"

శారద ముఖం ఒక్కసారి ఎర్రబడింది. పాపం, ఆ విషయం నాకు తెలీదని అనుకుంది!

"ఊరికేనే అలా అన్నాను" అంది.

"అదొక అబద్ధమా?"

శారదకి చాలా కోపం వచ్చింది. "ఆయన ఆ డబ్బు తేగలి గితే తప్పకుండా పెళ్ళాడతాను" అంది పౌరుషంగా.

"అదే వేచివుండి చూడాల్సింది."

"నేనూను."

ఇంక శారదతో మాటలాడడం అసంభవం అని తేల్చుకుని లేచాను. అందాలుచిందే శారదని నా మనస్సులో నించి తుడిచిపెట్టి ఒక రాతిబొమ్మని అక్కడ వుంచాను.

* * *

నెలరోజులయ్యాక మళ్ళా ప్రకాశం ఉత్తరం రాశాడు:

"ఆ ఆరువందలూ పదిహేను రోజుల్లో ఖర్చుపెట్టాను. ఎలా

అంటావ్? చాలా సరదాగా. మంచి స్నేహితులు దొరికారులే. చేతిలో ఈ ఉత్తరం పంపడానికి మాత్రం డబ్బు మిగిలింది.

అందులో ఓ స్నేహితు డెట్లా పరిచయం అయ్యాడో తెలుసా?

ఓ సాయంత్రం ఒంటరిగా ఒక పేవ్‌మెంట్ దగ్గర ని బడ్డాను. చక్కటి బట్టలు వేసుకున్న ఒకతను నా దగ్గరికి వచ్చి తెలుగులో, "ఎవరండీ మీరు?" అన్నాడు. బంగాళీవాడిలాగ కని పించినా, ఒక్కసారి తెలుగువాడని పోల్చుకున్నాను.

కాని, ఎవరని చెప్పుకోను?

"ఒక మనిషిని" అన్నాను.

అతను నవ్వాడు. భుజంమీద చెయ్యివేసి, "రండి, కాస్త టీ తాగుదాం" అన్నాడు.

లేచాను. ఏదేదో తిని డ్రింక్స్ తాగాం. తొందరగా బిల్లు చెల్లించాను. అతను కొంచెం నొచ్చుకున్నట్లు కనిపించాడు.

ఒక టాక్సీని పిలిచి నన్ను తన ఇంటికి తీసికెళ్ళాడు నాతో చాలా సరదాగా మాట్లాడుతున్నాడు. చక్కటి ఇల్లతనిది. పటా తోనూ, ఫర్నిచర్‌తోనూ ఎంతో అందంగా అలంకరించాడు. ఇం ఎవరో పిల్లలు అల్లరి చేస్తున్నారు. తన పిల్లలని నాకు పరిచయ చేశాడు. ఎంత బాగున్నారంటావ్!

ఎన్నో విషయా లతను చెప్పాడు, పాపం! నా స్నేహం కోసం చాలా ప్రయత్నించాడు. కాని నా బుర్రలో ఏం ఆలోచనలు సాగుతున్నాయంటావు? అతని సౌఖ్యం నాకు ఈర్ష్యాకారణం అయింది. నా బ్రతుకు గురించి నా ఆలోచనలు పరిగెట్టాయి.

నా జీవితంవల్ల ఎవరికేనా - నాకైనా - లాభం ఉందా అని ఆలోచించసాగాను. ఆ గృహ పరిసరాలు చూస్తూంటే, ఆ పిల్లల సందడి వింటూంటే నాకు జీవితంమీద విరక్తి ఎక్కువైంది.

నా పరధ్యానం చూసి అతను కొంచెం నొచ్చుకున్నాడు మళ్ళీ. గ్రహించి లేచాను. మళ్ళా వస్తా నన్నాను. అడ్రస్ అడిగాడు.

నా హోటల్ అడ్రస్ యిచ్చాను.

తిన్నగా బయటికి వచ్చాను. నాలో ఒక బలమైన కోరిక ప్రవేశించింది—చచ్చిపోవాలని.

పర్స్‌లో ఉన్న డబ్బంతా చిల్లర రూపాయలు చేశాను. కనిపించిన ప్రతీ ముష్టివాడికీ యిచ్చాను. బైలేన్స్‌లోకి వెళ్ళి మరీ ఇచ్చా.

నన్ను పోలీసులు వెంటాడేరు. రైలుకింద తల పెట్టడానికి కుదరక, ఒకచోట రోడ్డు ప్రక్క పడుకున్నా నా రాత్రి.

మర్నాడు ఉదయం మళ్ళా రోడ్లమ్మట పడ్డాను. తిరుగుతూంటే ఎవరో పిల్చి ఒక అణా యిచ్చారు.

ముష్టి ఎత్తడం ఎలాగో తెల్సుకోవా లనుకున్నాను. గట్టిగా అరుస్తూ తిరగసాగాను, "ధర్మం బాబూ! ఒక అణా."

సాయంత్రానికి పది వేగన్ల తిట్లూ, పదిహేనణాలూ వసూ లయ్యాయి. కడుపుకి జవాబిచ్చి ఓ కవరూ కాగితమూ కొన్నాను. నా పెన్ యింకా వుందిలే.

మంచి విచిత్రంగా వుందిలే జీవితం. నువ్వేమీ దిగులు నొడకు. చచ్చిపోను—నీ ప్రకాశం."

ఉత్తరం చదివేసరికి నాకు ఏడుపు వచ్చింది. ఎంత బాధ పడుతున్నాడో! 'అమ్మా! ధర్మం' అంటూ అడుక్కుంటున్నాడా? ఒక్కసారి కలకత్తా వెళ్ళి వాడిని పట్టి తీసుకొద్దామనుకున్నాను. కాని ఆ మహానగరంలో ఎక్కడ వెదకడం?

* * *

తరవాత రెండు నెలలదాకా ఏమీ ఉత్తరం రాలేదు వాడి దగ్గరనుంచి. అప్పుడు వచ్చిన ఉత్తరం ఇది:

"బ్రతికే వున్నానులే. క్రిందటి నెల అంతా డబ్బులేక ఉత్తరం రాయలేదు, ఈ నెల తీరికలేక రాయలేదు.

చిన్న గమ్మత్తు జరిగింది. ఆ సాయంత్రం కనిపించాడే, తెలుగువాడు - అతను నెలరోజుల కిందట నన్ను పట్టుకున్నాడు. కార్లో వెడుతూ ఆగి, బలవంతాన యింటికి తీసికెళ్ళాడు.

అతను నన్నెంతగా ఆదరించాడంటే, నా కథ అంతా అతనికి చెప్పక తప్పలేదు. అంతా విని, అతను, పాపం! కంట నీరు పెట్టాడు, నాకే కన్నీరురాని నా గాథ విని....

తక్షణం అతను నా బట్టలు మార్పించి మళ్ళీ మామూలు ప్రకాశంగా తయారు చేశాడు. భోజనం చేయించాడు.

అతనాట్టే చదువుకోలేదు. కాని, పెద్ద వ్యాపారం. రెండు లక్షలకి తక్కువ ఆస్తికాదేమో!

పిల్లలకి చాలా జబ్బుగా వుందనీ, తాను అస్తమానూ బొంబాయికీ, కలకత్తాకీ తిరగలేకుండా వున్నాననీ చెప్పి, నాకు వెంటనే అలహాబాద్ వెళ్ళే పని ఒకటి అప్పగించాడు.

నేను కాదనలేక పోయాను. బయలుదేరాను.

అదృష్టవశాత్తూ ఆ పని అంతా చాలా సక్రమంగా జరిగింది. ఎనభై వేలకి కాంట్రాక్టు కుదిర్చాను. అతను నన్ను చాలా అభినందించాడు. ఆ ఎనభై వేలలో ఇరవై వేలదాకా లాభం వుంటుందట. తానే వెళ్ళివుంటే పని అంత చక్కగా జరిగివుండేది కాదన్నాడు.

చివరకి నన్ను తన భాగస్వామిగా చేర్చుకుంటేగాని అతనాగలేదు. ఇప్పుడు నేను అతని కంపెనీలో భాగస్వామిని, నెలకి అయిదువేలు కనీసం రాబడి.

నువ్వొక్కడివే ఈ వార్త విని సంతోషిస్తావని తెల్సును. అందుకే రాశాను—నీ ప్రకాశం."

నాకేదో గొప్ప లాభం వచ్చినట్లనిపించింది. సంతోషంగా నిట్టూర్చాను.

*                *                *

ఇదంతా రెండు సంవత్సరాల కిందటి గాథ. అప్పటినించీ నెలకోసారైనా ప్రకాశం ఉత్తరం రాస్తూనే వున్నాడు. ఈ నాడు వాడు సుమారు లక్ష రూపాయల కధినాథు డయాడు.

మధ్యమధ్య శారద కనిపిస్తూనే వుంది. అప్పుడప్పు డడిగేది ప్రకాశాన్నిగురించి, ఎంతో ఆప్యాయంగా. నిజం దాచి, వాడు

కలకత్తాలో చాలా బాధపడుతున్నాడని చెప్పేవాడిని. "మూర్ఖత్వం" అనేది. ఒళ్ళు మండేది.

నిన్న సాయంత్రం ప్రకాశం దగ్గరనించి ఉత్తరం వచ్చింది:

"ఆదివారం ఉదయానికి వస్తున్నాను. ఎలాగైనా శారద అక్కడ ఉంటే ఒకసారి మన యింటికి రమ్మను. మాట్లాడాలి. మిగతా విషయాలు ముఖస్థంగా మాట్లాడుకుందాం—నీ ప్రకాశం."

శారదతో ఈ విషయం చెప్పి, ఆమెని ఒకసారి రమ్మన మనడానికని వాళ్ళ యింటికి వెళ్ళాను. చాలా నిరాడంబరంగా ఒక కుర్చీలో కూచుని ఆమె ఏదో చదువుకుంటూంది. ఈ మధ్య పాపం-వాళ్ళ ఆస్తి అంతా దావాలలో చిక్కుకుని కొంచెం దెబ్బతింది.

నన్ను చూచి ఆమె లేచింది.

కూచోకుండానే ఉపక్రమించాను: "ఆదివారం ఒకసారి మా యింటికి వస్తావా?" అంటూ.

"ఏం?" అంది.

"ప్రకాశం వస్తున్నాడు, కంపెనీకి...."

ఆమె తెల్లబోయింది. "నిజంగా?" అంది,

"నిజం."

"ఏం చేస్తున్నా డిప్పు డాయన?"

"ఏముంది? ఓ లక్ష వెనకేసుకున్నాడుగా!"

"హాస్యమా?"

"అక్షరాలా నిజం. ఇన్నాళ్ళనుంచీ వాడి కోర్కెమీద నిజం దాచాను."

"ఎంత కోపమో!" అంది నవ్వుతూ శారద.

"దానికేం గాని, వస్తావా?" అన్నాను.

"నే రాను. వీలైతే ఆయన్నే ఇక్కడికి రమ్మను."

ప్రకాశం సాధించదలుచుకున్న పనికి అదే ఉత్తమంలా కనిపించింది. సరే నన్నాను.

వెళుతూంటే మళ్ళా వెనక్కి పిల్చి, "ఆయన రావటం ఎప్పుడు?" అంది.

"రేపు ఉదయం."

"ఎప్పుడు తీసుకొస్తావ్?"

"నేను వాడితో చెప్తాను. వీలైతే ముందు కబురు పెడతాను."

మర్నాడు ప్రకాశం వచ్చాక శారద విషయమే వాడు ఎత్త లేదు. మధ్యాహం మూడు అయ్యాక, ఆమె ఆహ్వానం మాట జ్ఞాపకంవచ్చి వాడితో చెప్పాను. "నిజమేనల్లే - ఈ పరిస్థితికంతా ఓ విధంగా ఆమె కారణం. అందుచేత ఒకసారి మాట్లాడి వస్తాను" అన్నాడు వాడు.

వాడు తిరిగి వచ్చాక జరిగిన సంగతంతా చెప్పాడు.

ప్రకాశం వెళ్ళేసరికి శారద వాడికోసం చూస్తున్నట్లు మెట్ల దగ్గిర నిలబడి వుంది. "నమస్తే! దయచెయ్యండి" అంది.

ప్రకాశం ఆమె వెనక లోపలికి నడిచాడు. కాఫీ ఇస్తూ, "చాలాకాలానికి తిరిగి దర్శనం యిచ్చారు!" అంది.

"ఇప్పటిదాకా తీరిక లేకపోయింది లెండి" అన్నాడు ప్రకాశం.

"అది సరే గాని, మీ స్నేహితుణ్ణి మీ నిజ విషయం అంతా కప్పిపుచ్చమన్నారట—ఏం?" అని అడిగింది శారద.

ప్రకాశం నవ్వుతూ, "అదే చెప్పాలని వచ్చాను. మీతో నేనే చెప్పా లనుకున్నాను....కాని...." అని నసిగాడు.

తరవాత కొద్ది నిమిషాలు నిశ్శబ్దంగా గడిచాయి.

"ఆ రోజు నామీద కోపం వచ్చిందా?" అంది శారద.

"ఆ రోజు వచ్చినా, ఈ రోజు మీమీద నాకు చాలా గౌరవంగా వుంది. ఆ సాహసం చేసి ఉండకపోతే...."

"కాని, నేనంత కఠినంగా ఎందుకు చెప్పానో తెలుసా?"

ప్రకాశం తలఎత్తి చూశాడు ఆమె తల దించుకుని చెప్పింది:

"ఆ సాహసం చెయ్యడానికి నేనలా ప్రవర్తించాలని నాకు తెలుసు. నిజంగా మిమ్మల్ని ప్రేమించే అంత కఠినంగా ప్రవర్తించాను."

"అలాగా?"

"మీరాపాటి గ్రహించ రనుకోలేదు."

మళ్ళీ కొద్ది క్షణాలు నిశ్శబ్దం.

"ఇలా మీరు కలిసినందు కెంత సంతోషిస్తున్నానో తెలుసా? నేనం ప్రేమించుకున్న...." అంది శారద.

ప్రకాశం అందుకుని, "ఆ మాట ఎత్తకండి" అన్నాడు.

ఆమె తెల్లబోయి "ఏం?" అన్నది

"నే నిప్పుడు మిమ్మల్ని ప్రేమించడం లేదు అంతా మారిపోయాను."

"అయితే ఆనాటి మీ మాటలన్నీ నాటకం అన్నమాట!"

"ఈనాటి నుంచి చూస్తే అంతే."

"నిజం చెప్తున్నారా?"

"నిజమే."

ఆమె దెబ్బతిన్నట్టు చూసింది.

"ఉన్నమాట చెప్పాను శారదా! నే నీ రోజు మీరంటే ఏమీ ప్రేమించటం లేదు. కాని, అనుకోకుండా మీ మూలాన జరిగిన ఉపకారానికి కృతజ్ఞత చెప్పడం నా విధి. అందుకే వచ్చాను. మనం స్నేహితులుగా విడిపోదాం."

శారద చాలా గొప్ప దెబ్బ తిన్నది—ఆమె ముఖంలో ఆ దెబ్బని దాచుకోడానికి ఆమె చేసే ప్రయత్నం అంతా కనిపిస్తున్నది.

"ఇంక వెళ్ళండి" అందామె.

ప్రకాశం వచ్చేశాడు.

ఇదీ అక్కడ జరిగిన కథ. అంతా చెప్పేక ప్రకాశం ముఖంలో ఏ పశ్చాత్తాపమూ కనబడలేదు.

"అయితే, ఆ నాడు నువ్వు చెప్పిన విషయమంతా—అదే శారదని నువ్వు ప్రేమించడం గురించి—అబద్ధం అన్నమాట. నా దగ్గర కూడా నిజం దాచావు" అన్నాను.

వాడు కొంచెం నవ్వాడు. "వాస్తవంగా నీతో నేను అబద్ధం ఆడలేదు. భావాలు మారాయ్ పరిస్థితులనిబట్టి" అన్నాడు.

నాకు బోధపడలేదు. ఎవరికైనా ఆ పరిస్థితి బోధపడ దను

కుంటాను. వా డింకా ఏమన్నా చెప్తాడేమో అని అలాగే ఆగాను కొన్ని నిముషాల నిశ్శబ్దం తరువాత "ఏమైనా నువ్వు చేసింది తప్పు. ఆమె ప్రేమని తిరస్కరించావు" అన్నాను.

వాడు సిగరెట్ పొగ వదులుతూ, లేచి కిటికీదగ్గర నిలబడి "పరిస్థితి అంతా ఆలోచించా ననుకున్నాను కాని నా ఉద్దేశం తప్పని గుర్తించాను. ఇందులో బయటికి కనిపించని దంతా చెప్తా విను" అన్నాడు.

"ఆమె ధనవంతురాలుగానూ, నేను బీదవాడుగానూ ఉన్నప్పుడు మా ప్రణయం ప్రారంభించింది—నా ప్రణయం అంటాను. ఆ బీదతనంలో ప్రేమా, త్యాగంలాంటి మాటలు నాకు చాలా గొప్పగా కనిపించేవి. ఎటొచ్చీ నా ప్రేమని అంగీకరిస్తే నష్టపొయ్యేది ఆమె కనుక, ఆమె కఠినంగా వుండగలిగింది.

"ఇప్పుడు ఆమె బీదరికంలోకి జారింది. నేనైతే, ఆమె మూలాన్నే ఏమో—నాకా విషయంలో ఏ ఉద్దేశమూ లేదు—ధనవంతుణ్ణయ్యాను. నా కిప్పుడు ప్రేమమీదా, త్యాగంలాంటి కబుర్ల మీదా నమ్మకం పోయింది. ఆమె ఇప్పుడు కాస్త బీదరికానికి వచ్చిందిగా—వీటిమీద ఒక్కసారి ఆమెకి నమ్మకం పుట్టుకు వచ్చింది.

"మే మిద్దరమూ అదృష్ట చక్రంలో దూరదూరంగా వున్న రెండు బిందువులం. ఆ చక్రం నుంచి వేరుపడితేకాని కలియలేము. ఇంక ఎందుకురా నాకీ వ్యవహారం?

"అందుచేతనే, ఆమె కాఠిన్యానికి పగతీర్చుకుంటూ, అంత అవమానకరంగా కూడా ఆమెని తిరస్కరించాను. ఇవాళ ఒక బంధం వదిలిపోయింది" అని ముగించాడు.

"నువ్వు పెళ్ళే చేసుకోవా?"

"చేసుకుంటున్నాను—మద్రాసులో మా వ్యాపారంలో ఒకడు పరిచయం అయాడు. అతని కూతురు వుందిలే. అతనికి నాలుగైదు లక్షల ఆస్తి వుంది. మరి పిల్లలు లేరు....సుమారుగా నిశ్చయించుకున్నట్లే."

కొన్ని వందల మైళ్ళు వేగంతో వెనక్కి ప్రయాణిస్తున్న ట్లనిపించింది నాకు.

"కాని నువ్వు శారద కళ్లలో ఏదో కాంతిని చూసేవాడి వన్నావు?" అన్నాను.

వాడు చిరునవ్వుతో పర్సులోంచి రెండు ఫొటోలు తీశాడు. ఒకటి శారదది రెండోది ఎవరిదో.

"ఇది ఆ రోజుల్లో శారద ఫొటో. కళ్ళు బాగా కనిపించాలని క్లోజప్‌చేసి తీయించింది. ఆ కళ్లలో ప్రతిఫలిస్తోన్న కాంతి చూశావా?" అన్నాడు,

పరీక్షగా చూశాను. ఏదో ప్రత్యేకమైన కాంతి ఉన్నట్లే కనిపించింది. "ఇప్పుడు శారద కళ్లలో ఆ కాంతి ఏమీ కనపడదు తెలుసా?" అన్నాడు ప్రకాశం.

నేను వాడి మాటలు వింటున్నాను.

రెండో ఫొటో ముందు పడవేసి, "ఇందులో ఈమె కళ్లు చూడు" అన్నాడు. పరీక్షగా చూశాను కళ్లు—అంతకన్న వాటిలో నాకేమీ ప్రత్యేకత కనిపించలేదు. నా నిశ్శబ్దాన్ని చూసి, "ఆ కాంతి ఈ కళ్ళలో మళ్ళా నాకు కనిపించింది."

నా కర్థం అయింది. వాడు సిగరెట్ ముట్టించి గదిని పొగతో నింపాడు. నేను వాడి కళ్ళల్లోకి చూశాను. అవి జ్యోతులల్లే ప్రకాశించడం లేదు కాని, కాంతివంతంగా ఉన్నట్లుమాత్రం కనిపించాయి.

మనసారా వాడి సౌఖ్యాన్ని కోరుతూ ఆశీర్వదించాను.